క్లుప్తంగా

నవజాత శిశువుల మరణాల నివారణే లక్ష్యం



గూడూరు: నియోనటల్ అంబులెన్స్‌ల ద్వారా నవజాత శిశువుల మరణాల నివారణే లక్ష్యంగా సేవలు అందిస్తున్నట్లు ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ జిల్లా మేనేజర్ బత్తిని మహేష్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆవరణలో సోమవారం జిల్లాకు మంజూరైన నియోనటల్ అంబులెన్స్ సేవలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యోగులు భిక్షపతి, నెహ్రూనాయక్, హనుమంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



తొర్రూరు రూరల్: గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత నాయకుడు సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెలికట్ట గ్రామశివారు పెద్దమంగ్య తండాలో సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు హమ్యానాయక్, సుంచు సంతోష్, డాక్టర్ సోమేశ్వర్‌రావు, రామచంద్రయ్య, పెరటి యాకుబ్‌రెడ్డి పాల్గొన్నారు..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాగమణి



గార్ల: ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచంద్రరావును హైదరాబాద్‌లో సోమవారం బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుండె బోయిన నాగమణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మాక్ పోలింగ్



మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధనలక్ష్మి, వార్డెన్ జయసుధ, ఉపాధ్యాయులు మొగులయ్య, బద్రు, రమేష్, రాము పాల్గొన్నారు.

దాడి ఘటనలో ముగ్గురి అరెస్ట్

నర్సింహులపేట: మండలంలోని వస్రాంతండా జీపీ పరిధిలోని బక్కచంద్రుతండాలో సోమవారం ఉదయం భూ తగాదాలో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బక్కచంద్రుతండాలో భూ తగాదా విషయంలో బానోతు మంగ్యా, బానోతు ద్వాలిపై అదే తండాకు చెందిన బానోతు భద్రు, బానోతు కల్యాణ్, బానోతు మనోజ్‌లు గొడ్డలి, కర్రలతో దాడి చేశారు. దాడిలో మంగ్యా, ద్వాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెల్సింది. గుగులోతు లాలు ఫిర్యాదు మేరకు కేసు ముగ్గురిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

కేసముద్రం: ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం తమకు పట్టా పాసుబుక్కులు అందించాలంటూ మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతులు చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 7వ రోజుకు చేరుకున్నాయి.

ఐసెట్‌లో 3వ ర్యాంక్



కౌశిక్

పెద్దవంగర: ఐసెట్‌లో మండలవాసి రాష్ట్ర స్థాయిలో మెరిశాడు. పోచంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి కోటగిరి కౌశిక్ టీజీ ఐసెట్-2025లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. 154.32 మార్కులు సాధించి సత్తా చాటాడు. తండ్రి కోటగిరి కుమార్ ప్రైవేట్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కాగా, తల్లి యాకలక్ష్మి అంగన్‌వాడీ టీచర్.

సన్నాల వైపు.. అన్నదాత చూపు

- ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుండటంతో ఆశపడుతున్న రైతులు

తొర్రూరు రూరల్: డివిజన్‌లోని తొర్రూరు, పెద్దవంగర మండలాల పరిధిలోని అన్ని గ్రామాలు, తండాల్లోని రైతులు ఈ ఖరీఫ్ పంటలో సన్నాలనే ఎక్కువ శాతం సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా డివిజన్ పరిధిలో గత రబీ సీజన్‌లో 30వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, అందులో 80శాతం సన్నాలు, మిగిలిన 20శాతం దొడ్డు ధాన్యం సాగు చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కూడా 30వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేసేందుకు సిద్ధమవుతుండగా, అందులో 99శాతంతో 29వేల ఎకరాల్లో సన్నాలనే పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నాలకే ప్రతి క్వింటాకు మద్దతు ధరతోపాటు రూ.500బోనస్ అదనంగా ఇస్తామని హామీ ఇచ్చింది. గత సీజన్‌లో సన్నాలను సాగు చేసిన రైతులకు ప్రతి క్వింటాకు రూ.500బోనస్ ఇవ్వడం ప్రారంభించడంతో మద్దతు ధరతోపాటు బోనస్‌కు మరింత ఆశపడుతున్నారు. ప్రతి రైతు సన్నాలనే సాగు చేసేందుకు మొగ్గు చూపుతూ ఇప్పటికే నారుమడిలను దున్నుతూ.. నారుపోస్తూ.. నాట్లను వేస్తూ రైతన్న బిజీబిజీగా గడుపుతున్నాడు.



సన్నాల నారుమడి

జాగ్రత్తలు పాటించాలి



వరిపంటలో సన్నాలను సాగు చేస్తున్న రైతులు నారు మడి నుంచే జాగ్రత్తలు పాటించాలి. దొడ్డు రకం ధాన్యం నారు కంటే సన్నాల నారుపై అప్రమత్తంగా ఉండాలి. ఏ చిన్న సమస్య వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలి. నారు పోసినప్పటి నుంచి పంటను కోసేవరకు ప్రతి రైతు సంబంధిత మందులను సమయానికే పిచికారీ చేస్తేనే సరైన దిగుబడి వస్తుంది.

– దుర్గం రాంనర్సయ్య, మండల వ్యవసాయ అధికారి

జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



మాట్లాడుతున్న విజయసారథి

కురవి: మహబూబాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. కురవిలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. జిల్లా మూడో మహాసభల తీర్మానాలను ప్రకటించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, కురవిని పర్యాటక ప్రాంతంగా ప్రకటించాలని, గార్ల మండలం రాంపురంలో హైలెవల్ బ్రిడ్జి, తొర్రూరులో ఏటీఓ కేంద్రం, సీతారామ ప్రాజెక్టు ద్వారా బయ్యారం, డోర్నకల్ నియోజకవర్గానికి సాగు నీరు అందించాలని, నూతన మండలాల్లో మౌలిక వసతులు, డోర్నకల్‌లో డ్రైపోర్ట్ ఏర్పాటు, రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని తీర్మానించారు. అనంతరం సీపీఐ జిల్లా నూతన సమితి ఎన్నిక నిర్వహించారు. కార్యదర్శిగా విజయసారథి, సహాయ కార్యదర్శులుగా నల్లు సుధాకర్‌రెడ్డి, బి.అజయ్‌సారథిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, పాండురంగాచారి, రేషపల్లి నవీన్, వరిపెల్లి వెంకన్న, నెల్లూరి నాగేశ్వర్ రావులతోపాటు మరో 24 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నట్లు కార్యదర్శి విజయసారథి తెలిపారు.

హామీలు అమలు చేయకుంటే పోరాటాలే..

- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

కురవి: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే బీఆర్‌ఎస్ కార్యకర్తలు పోరాటానికి సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మోకాలి శస్త్ర చికిత్స చేయించుకుని తొలిసారిగా కురవికి వచ్చిన ఆమె సోమవారం మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు జిల్లాకు అభివృద్ధి చేసింది ఏమి లేదని విమర్శించారు. మంత్రుల్లో సమన్వయం లేదని, అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పిచ్చిరెడ్డి, గుగులోత్ రవినాయక్, గుగులోత్ పద్మ నెహ్రూ, బాదె నాగయ్య, కిశోర్‌వర్మ, శ్రీను, భిక్షంరెడ్డి, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు, రేపు మార్కెట్ బంద్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 8వ తేదీ మంగళవారం, 9వ తేదీ బుధవారం రెండు రోజులు సెలవు ప్రకటించామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ సోమవారం తెలిపారు. మార్కెట్ వ్యాపారి యాద లక్ష్మణ్ మృతికి సంతాప సూచకంగా సెలవు ఇచ్చామన్నారు.

ఎంపీడీఓ బదిలీ

దంతాలపల్లి: మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ వివేక్‌రామ్ బదిలీ అయినట్లు సోమవారం కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయ్యారన్నారు.

సొంత భవనం నిర్మించాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కురవి మండలంలో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతి బసు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ అధికారి నర్సింహారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గుండ్ల రాకేష్, మహేష్, ఆకాష్, వినేయ్ పాల్గొన్నారు.

'అమృత్' పనుల పరిశీలన

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అమృత్ జల్ పనులను ప్రజా ఆరోగ్యశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంజిత్ సోమవారం పరిశీలించారు. డోర్నకల్ చేపట్టిన అమృత్ పనులు ఆశాజనకంగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్, ఏఈ శృతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయి పాల్గొన్నారు.

'వోపా'అడహక్ కన్వీనర్‌గా లవన్



డోర్నకల్: రాష్ట్ర విశ్వబ్రాహ్మణ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(వోపా) జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్‌గా డోర్నకల్‌కు చెందిన కుందోజు లవన్ నియమితులయ్యారు.

మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

బయ్యారం: బయ్యారం పెద్దచెరువుకు గోదావరి జలాలు రాకుండా అప్పటి సీఎం కేసీఆర్ ద్రోహం చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు సోమవారం బయ్యారంలో ర్యాలీ నిర్వహించి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ డిజైన్ మార్చి బయ్యారం పెద్దచెరువుకు కేసీఆర్ ద్రోహం చేశారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముసలయ్య, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కిషన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం దుర్మార్గం

కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేయటం దుర్మార్గమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గణేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాజకీయ ప్రయోజనం కోసం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారన్నారు. ఈ సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు ఐలయ్య, మురళీకృష్ణ, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యలో రాణిస్తే మంచి గుర్తింపు



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్: విద్యార్థులు విద్యలో ఉత్తములుగా ప్రతిభ కనబరచటం వల్ల మంచి గుర్తింపు వస్తుందని కంబాలపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జి.ఉప్పలయ్య అన్నారు. మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 2025లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు సోమ బీరయ్య, రామక్క జ్ఞాపకార్థం వారి కుమారుడు, రిటైర్ ఉపాధ్యాయుడు సోమ విష్ణువర్ధన్ సోమవారం నగదు బహుమతి అందజేశారు. విగ్నేశ్‌కు రూ.3వేలు, ధనుంజయ్‌కు రూ.2వేలు, రూ.వెయ్యి శివకుమార్‌కు బహూకరించారు. బాసర ఐఐటీలో సీటు వచ్చిన విద్యార్థులు విగ్నేష్, ధనుంజయ్‌ని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, కాసం శ్రీనివాసరావు, తిరుపతి, సతీష్ కుమార్, సోమేశ్వర్, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, వీరభద్రం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



నెహ్రూసెంటర్: జెండా ఎగురవేస్తున్న పీరయ్య



మరిపెడ: కేక్ కట్ చేస్తున్న నాయకులు



తొర్రూరులో..



కురవిలో..

జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను సోమవారం సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగా ఎస్సీ వర్గీకరణ సాధించి సామాజిక ఉద్యమాల ద్వారా సకల జనులకు మేలు చేశాడన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

భూమికి పట్టా చేయాలంటూ నిరసన



పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న సుభద్ర

కురవి: తమ భూమికి పట్టా చేయాలంటూ భార్యాభర్తలు ఇద్దరు పురుగుల మందు డబ్బా పట్టుకుని కురవి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ ఎల్లమ్మకు నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హయాంలో 36గుంటల భూమిని పట్టా చేసి ఇవ్వడంతో సాగు చేసుకుని జీవిస్తున్నారు. ఎల్లమ్మకు కొడుకు వెంకన్న ఉన్నాడు. కొన్నేళ్ల క్రితం ఈ భూమి అదే గ్రామానికి చెందిన చిట్టిపురెడ్డి వెంకటరెడ్డిరమ పేరుపై మారింది. అప్పటి నుంచి వెంకన్న కుటుంబం తమ పేరు మీదకు మార్చాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు. సోమవారం వెంకన్న కుమార్తె సుభద్ర తన భర్త భిక్షపతితో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి పురుగుల మందు డబ్బాతో వచ్చి ఆందోళన చేసింది. ఇప్పుడు భూ భారతిలో కొత్తగా పేరు మార్చే అధికారం తమకు లేదని తహసీల్దార్ విజయ వారికి వివరించారు. కలెక్టరేట్‌కు వెళ్లి భూభారతిని చూసే అధికారి వద్దకు వారిని పంపించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

జీఓను ఉపసంహరించుకోవాలి



తొర్రూరు: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తొర్రూరు/నెల్లికుదురు: పని గంటల పెంపు జీఓను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ భిక్షపతి అన్నారు. ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ, టీయూసీఐ, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. నెల్లికుదురులో జీఓ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లం అశోక్, ఆంజనేయులు, శ్రీరాం పుల్లయ్య, జమ్ముల శ్రీను, బందు మహేందర్, సోమనర్సయ్య, లక్ష్మణ్, వరిపెల్లి వెంకన్న, ఇస్సపల్లి సైదులు, పెరుమాండ్ల బాబు గౌడ్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మరిపెడ రూరల్: జులై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు దుండి వీరన్న, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చయ్య, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వేతనాలు మంజూరు చేయండి

నెహ్రూసెంటర్: జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న కాంటిజెన్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని వర్కర్లు కోరారు. సోమవారం వారు మాట్లాడారు. 15 ఏళ్లుగా పని చేస్తున్నామని, సుమారుగా 26నెలల వేతనాలు రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో గీతారాణి, ఎస్‌కె.యాకుబి, భవాని, మంగమ్మ, ఉమ పాల్గొన్నారు.

రెండు రోజుల సెలవులు ఇవ్వాలి

మహబూబాబాద్: జిల్లా వ్యాప్తంగా సీత్లా పండుగ సందర్భంగా లంబాడీ ఉద్యోగస్తులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు రోజుల లోకల్ సెలవులు ఇవ్వాలని ఎల్‌హెచ్‌పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ బి.లక్ష్మణ్ సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

ఎంపీడీఓకు ఘనంగా వీడ్కోలు

నెల్లికుదురు: 17నెలలుగా మండల ప్రజలకు సేవలందించి బదిలీపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్తున్న ఎంపీడీఓ బాలరాజును సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంపీఓ పద్మకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు.

సద్వినియోగం చేసుకోవాలి

కురవి: కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వీరబాబు అన్నారు. సోమవారం గుండ్రాతిమడుగు(విలేజి), రాజోలు, నారాయణపురం, కంచర్లగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సులు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీఓ గౌస్, ఏపీఓ భూపాల్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈ–పాస్ యంత్రాలకు కొత్త స్కానర్లు

డోర్నకల్: స్థానిక జైన్‌భవన్‌లో పౌర సరఫాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం డోర్నకల్‌తోపాటు గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో ఈ–పాస్ యంత్రాలకు కొత్త స్కానర్లను అమర్చారు.

పాఠశాలకు స్మార్ట్ టీవీ బహూకరణ



నర్సింహులపేట: మండలంలోని బొడ్కతండా పీఎస్‌లో చదువుకున్న పూర్వవిద్యార్థులు బానోతు చంద్రశేఖర్ స్మార్ట్ టీవీ, బాదావత్ బాలాజీ సౌండ్ సిస్టంను సోమవారం ఎంఈఓ రామ్మోహన్‌రావు చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు.

బీఆర్‌ఎస్ సత్తా చాటాలి

తొర్రూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు అన్నారు. సోమవారం మండలంలోని చింతలపల్లి గ్రామంలో పార్టీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీరాం సుధీర్‌కుమార్, మంగళపెల్లి శ్రీనివాస్, ప్రమోద్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

మహబూబాబాద్ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని వేమునూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉచిత టై, బెల్టులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చీకటి ఉపేందర్, వినోద్, నరేష్, ఉపాధ్యాయులు రమేష్, భోజన్, సుచరిత పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

నర్సింహులపేట: రైతులకు ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని ఏఓ వినయ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో ఎరువుల షాపులను తనిఖీ చేశారు.

వైద్యశిబిరం

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సీరోలు తహసీల్దార్ పున్నంచందర్ సందర్శించారు.

మహిళ మృతి కేసులో రిమాండ్

పెద్దవంగర: ఈనెల 4న మండలంలోని అవుతాపురం గ్రామంలో వేముల ఝాన్సీ అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి చింతకింది వెంకట సోమయ్య ఫిర్యాదు మేరకు తొర్రూరు వాసి చిదిరాల రాజు, అవుతాపురానికి చెందిన సల్దెండి ప్రవీణ్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ సోమవారం తెలిపారు.

ముళ్ల చెట్లను తొలగించాలి

మహబూబాబాద్: అనంతారం దేవాలయం వెళ్లే రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ల చెట్లను తొలగించాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ టి.రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సమ్మె నోటీస్ అందజేత

డోర్నకల్: మున్సిపాలిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి దాసరి మల్లేశం కోరారు. జులై 9న దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మె నోటీస్‌ను సోమవారం కమిషనర్ నిరంజన్‌కు అందించారు.

అనర్హుల మాటలు నమ్మొద్దు

గూడూరు: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కమిటీ సభ్యులు, కార్యదర్శి డబ్బులు తీసుకున్నారని కొంత మంది చేస్తున్న మాటలు అవాస్తవమని, ఇళ్లు రాని వారి మాటలు నమ్మరాదని మాజీ సర్పంచ్ యాకయ్య, శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ ఎదుట సోమవారం వారు మాట్లాడారు.

ఓటరు జాబితాపై అవగాహన

దంతాలపల్లి: మండలకేంద్రం రైతువేదికలో తహసీల్దారు సునీల్‌కుమార్ సోమవారం బీఎల్‌ఓలకు ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో బీఎల్‌ఓలకు తొర్రూరు ఆర్‌డీఓ గణేశ్ బీఎల్‌ఓలకు ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రమేశ్, బాబు, ట్రైనర్లు వీరన్న, యాదగిరి పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు

మహబూబాబాద్ రూరల్: పట్టణంలో వాహనదారులు, ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వీధి వ్యాపారులు, షాపుయజమానులకు, ఆటో డ్రైవర్లకు టౌన్ సీఐ సోమవారం అవగాహన కల్పించారు. శ్రీనివాస సెంటర్ నుంచి ముత్యాలమ్మ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపుల వైట్ లైన్ వేయించారు. ట్రాఫిక్ ఎస్సై నాగేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

గూడూరు: పేదల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు హోలీఫైర్ మినిస్ట్రీ ట్రస్ట్ వ్యవస్థాకుడు ఇశ్రాయేలు అన్నారు. మండలంలోని కొల్లాపురం పాఠశాలలో సోమవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో 34 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు వైస్ చైర్‌పర్సన్ సునీత, జాయింట్ సెక్రటరీ గుండెపాక ప్రభాకర్, సభ్యులు అమరేందర్, వీరస్వామి, వెంకన్న, యాకయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

అభినందనీయం

తొర్రూరు రూరల్: నిరుపేద విద్యార్థులకు చేయూత నివ్వడం అభినందనీయమని హెచ్‌ఎం తండ ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని కంఠాయపాలెం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు కిన్నెర సంతోష్, తూర్పాటి కన్నయ్య, పస్తం లక్ష్మణ్, కిన్నెర సుబ్రహ్మణ్యం, కిన్నెర వెంకన్న, చిల్ల వెంకటేష్‌ల సహకారంతో బ్యాగ్స్, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.

మొహర్రం వేడుకలు



మహబూబాబాద్ రూరల్: బేతోలులో..



గార్ల పురవీధుల్లో..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలులో గ్రామంలో సోమవారం మొహర్రం వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. పీరీలను ఊరేగించారు.

గార్ల: మొహర్రం వేడుకలు సోమవారం ముస్లిం సోదరులు గార్ల పురవీధుల్లో పీరీల ఊరేగింపు నిర్వహించారు.